
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 61 వ భాగం

## దక్ష ప్రజాపతి – 10

### బ్రహ్మలోకంలో దేవతలు

దక్ష యజ్ఞం నాశనం చేసాక వీరభద్రుడి పని అయిపోయింది. కైలాసానికి వెనక్కి వెళ్ళి తనకి అప్పగించిన పని పూర్తి చేసినట్టూ చెప్పాడు శివుడితో. మరి యజ్ఞానికి వచ్చి చావుదెబ్బలు తిన్న మిగతావారి సంగతో? వాళ్ళకి కైలాసానికి వెళ్ళడానికి భయం.

చ. హరభటకోటిచేత నిశి తాసి గదా కరవాల శూల ము
ద్గర ముసలాది సాధనవిదారిత జర్జరితాఖిలాంగులై
సురలు భయాకులాత్ము లగుచున్ సరసీరుహజాతుఁ జేరి త
చ్చరణ సరోరుహంబులకు సమ్మతిఁ జాఁగిలి మ్రొక్కి నమ్రులై. [4-124]

అందువల్ల అందరూ బ్రహ్మ దగ్గిరకి వెళ్ళి మొక్కి మొరపెట్టుకున్నారు ఇలా యజ్ఞం నాశనమైనట్టూ, తమకి జరిగిన అవమానానికీ, ముందు ఏమి జరుగుతుందో అనే భయం చేతా. (జర్జరితాఖిలంగులు – తూట్లు పడిన, అనేక అంగములు కలిగినవారు, సరసీరుహజాతుడు – సరసీరుహము=పద్మము; అందులో పుట్టినవాడు, బ్రహ్మ) భయం ఎందుకంటే కోపం వచ్చినది ఎవరికో కాదు, లయకారుడైన పరమేశ్వరుడికి.

ఈ కథంతా మైత్రేయుడు విదురుడికి చెప్తున్నాడని ముందు చెప్పుకున్నాం కదా? ఇప్పుడు మైత్రేయ మహర్షి విదురుడితో ఏమంటున్నాడంటే,

తే. ఇంతయును మున్ను మనమున నెఱిఁగి యున్న
కతన విశ్వాత్మకుండును గమలలోచ
నుండు నన నొప్పు నారాయణుండు నజుఁడుఁ
జూడ రారైరి మున్ను దక్షుని మఖంబు [4-126]

ఇదంతా విన్నాడు చతుర్ముఖుడు. ఇలా జరుగుతుందని ముందే తెలుసు ఈయనకీ, పద్మనాభుడికీను. అందుకే వాళ్ళు అసలు ఈ యజ్ఞానికి మొదట్లోనే వెళ్లలేదు. అంటే లయం జరుగుతుంటే దాన్ని ఆపడానికి ఎవరికీ అధికారం లేదు. అది జరిగి తీరుతుంది.

మరి ఈ యజ్ఞం ఇలా మధ్యలో ఆగిపోయింది. చేసేవాడి తల యజ్ఞగుండంలో పడింది. ఏం చేయాలిప్పుడు?

క. ఘన తేజోనిధి పురుషుం
దనయంబుఁ గృతాపరాధుఁ డయినను దా మ
ల్లన ప్రతికారముఁ గావిం
చిన జనులకు లోకమందు సేమము గలదే? [4-128]

శివుడెటువంటివాడు? మహా తేజస్సంపన్నుడు. మీరేదో ఆయన అపరాధం చేసాడు దక్షుడికి అనుకుంటూ దక్షుడి కూడా ఉండి మరో అపరాధం జరుగుతూంటే నిమ్మకు నీరెత్తినట్టూ కూర్చున్నారు ఆ యజ్ఞంలో. అలా తెలిసో తెలియకో మహాత్ములకు ప్రతి అపరాధం చేసేవాళ్లకి లోకంలో క్షేమం ఎలా కలుగుతుంది?

క. క్రతుభాగార్హుం డగు పశు
పతి నీశ్వరు నభవు శర్వు భర్గుని దూరీ
కృత యజ్ఞభాగుఁ జేసిన
యతి దోషులు దుష్టమతులు నగు మీ రింకన్. [4-130]

అదీగాక – పశుపతి, ఈశ్వరుడు, అభవుడు, శర్వుడు, భర్గుడు – అయిన మహేశ్వరుడికి భాగం లేకుండా యజ్ఞం, క్రతువులూ అనేవే చేయకూడదు. అది తెలిసి కూడా ఆయనకి యజ్ఞంలో భాగం లేకుండా చేసారు కనక ఆ దోషం మీకు అంటుకుంటుంది.

ఇక్కడోసారి ఆగి కథ చూద్దాం వెనక్కి. యజ్ఞం చేసింది దక్షుడు, శివుణ్ణి దూషించింది, శపించింది కూడా దక్షుడే. ఈ యజ్ఞానికి దక్షుడు పిలిస్తే దేవతలూ మునులూ సదస్యుల్లాగా వెళ్ళారు. వాళ్ల తప్పు ఏముంది ఇందులో? ఇక్కడ బ్రహ్మ వీళ్ళతో మీకు దోషం అంటుకుంటుంది అంటాడేమిటి?

దీనికో చిన్న కథ చెప్పుకుందాం. పన్నెండేళ్ళు అరణ్యవాసం పదమూడో ఏడు అజ్ఞాతవాసం చేసాక ధర్మరాజు అడుగుతాడు కౌరవులని మాకు అయిదు ఊళ్ళు ఇచ్చినా చాలు, మేము యుద్ధానికి రాము అని. ఈ విషయం రాయబారిగా వచ్చిన సంజయుడితో చెప్పినప్పుడు ఆయన వెనక్కి వెళ్ళబోతూంటే కృష్ణుడు చెప్తాడు, “నేనే వస్తున్నాను రాయబారానికి, సిద్ధంగా ఉండమను,” అని. “హమ్మయ్యా నా తలమీదనుంచి బరువు దించావయ్యా” అనుకుని సంజయుడు వెనక్కి వెళ్ళాక కృష్ణుడు రాయబారానికి హస్తినాపురం వెళ్ళి సభలో చెప్తాడు, భీష్మ, ద్రోణ, ధృతరాష్ట్ర, కర్ణ, అశ్వత్థామ, కృపాచార్యులందరి వింటుండగా. మీరందరూ – ఇలా మేము ఏమీ చేయలేకపోతున్నాం ధుర్యోధనుడి వల్లా అని – చేతగాని వాళ్లలా కూర్చుంటే ఏమౌతుందో అనేది. ఈ సందర్భంలో తిక్కన రాసిన పద్యం మహాభారతం ఉద్యోగ పర్వంలో అతి ప్రసిద్ధికెక్కిన పద్యం.

ఉ. సారపు ధర్మమున్ విమల సత్యము పాపముచేత బొంకుచే
పారము పొందలేక చెడబారినదైన యవస్థ దక్షులై
వ్వారలుపేక్ష సేసిరది వారల చేటగు గాని ధర్మ ని
స్తారకమయ్యు, సత్య శుభదాయకమయ్యును దైవముండెడిన్ [ఉ. ప. 3.273]

అధర్మం జరుగుతూ ఉంటే తెలిసినా, ఏదో చేయగలిగి ఉండీ పట్టీ పట్టనట్టూ ఊరుకోవడం వల్ల, పోనీ నాకెందుకు అని మౌనంగా ఊరుకునేవాళ్లకి దోషం అంటుకుంటుంది కానీ ధర్మానికి జరిగే హాని ఏమీ ఉండదు. ఎందుకంటే ధర్మానికి, సత్యానికి హాని జరుగుతూంటే అడ్డుకోవడానికి భగవంతుడెప్పుడూ సిద్ధంగా ఉంటాడు.

"కృష్ణా, నేనెప్పుడూ ధర్మం తప్పినవాణ్ణి కాదు అయినా నాకు ఇటువంటి శిక్ష పడిందే, ఇలా ముళ్ళ మీద పడి అనుక్షణం బాధ అనుభవించవల్సి వచ్చిందే?" అని భీష్ముడు అడిగితే ఈ విషయాన్ని మళ్ళీ మరోసారి గుర్తు చేస్తాడు కృష్ణుడు అంపశయ్యమీద పడి ఉన్న భీష్ముడికి – ఆ రోజు ద్రౌపదికి అందరి ముందూ అన్యాయం జరుగుతుంటే మీకు చేతనై ఉండీ ఏమీ చేయకపోవడానికి ఇది శిక్ష అంటూ. ఆ రోజు తాను – సాక్షాత్తూ భగవంతుడు కనక – ద్రౌపదికి సభా ముఖంగా అవమానం తప్పించాడు కదా? అదే చివరి పాదంలో "ధర్మ నిస్తారకమయ్యు, సత్య శుభదాయకమయ్యును దైవముండెడిన్" అనేది.

బ్రహ్మ సదస్యులతో చెప్తున్న సంగతి సరిగ్గా ఇదే. దక్షుడు శివుణ్ణి దూషిస్తున్నా ఇన్నాళ్లలో, వీళ్ళందరూ చూస్తూ ఊరుకున్నారు కానీ ఏమీ చేయలేదు కదా? అలా వీళ్ళకూ్కడా దోషం అంటుకున్నట్టే.

సీ. పూని యే దేవుని బొమముడి మాత్రన;
లోకపాలకులును లోకములును
నాశ మొందుదు; రట్టి యీశుండు ఘన దురు;
క్త్యస్త్ర నికాయ విద్ధాంతరంగుఁ
డును బ్రియా విరహితుండును నైనవాఁ డమ్మ;
హాత్మునిఁ ద్రిపుర సంహారకరుని
మఖపునస్సంధానమతి నపేక్షించు మీ;
రలు చేరి శుద్ధాంతరంగు లగుచు [4-131]

తే. భక్తినిష్ఠలఁ దత్పాద పద్మ యుగళ
ఘన పరిగ్రహ పూర్వంబుగాఁగ నతని
శరణ మొందుఁ డతండు ప్రసన్నుఁ డయినఁ
దివిరి మీ కోర్కి సిద్ధించు దివిజులార!" [4-131.1]

దక్షుడి అన్న మాట్లకీ, శాపానికీ – ఎవరి భృకుటి ముడిపడితే లోకాలన్నీ లయం అవుతాయో అటువంటి త్రిపురాసుర సంహారకుడైన – శివుడి మనస్సు గాయపడింది. అది చాలదన్నట్టూ యజ్ఞవాటికలో అవమానించడం వల్ల సతీదేవి దేహత్యాగం చేసింది కదా. సరే ఏదో ఒకటి జరిగింది. వెళ్ళి ఆయన కాళ్ళమీద పడి అడగండి. ఆయన ప్రసనుడైతే మంచి జరుగుతుంది. ఇదే దాదాపు అంబరీషోపాఖ్యానంలో కూడా జరగడం గమనించవచ్చు. దూర్వాసుడు ఎవరూ సహాయం చేయకపోతే చివరకి విష్ణువు దగ్గిరకి వెళ్ళినా, నేనేం చేయ(లే)ను, పోయి ఆ అంబరీషుడితోనే చెప్పుకో అంటాడు కదా? ఎవరికైతే మనం తప్పు చేస్తామో వాళ్ళనే క్షమించమని అడగాలి.

వ. అని మఱియు నిట్లనియె; అద్దేవుని డాయం జన వెఱతు మని తలంపకుండు; అతనిఁ జేరు నుపాయం బెఱింగిపుమంటి రేని, నేను నింద్రుండును మునులును మీరలును మఱియు దేహధారు లెవ్వ రేని నమ్మహాత్ముని రూపంబు నతని బలపరాక్రమంబుల కొలఁదియు నెఱుంగజాలము; అతండు స్వతంత్రుండు గావునఁ దదుపాయం బెఱింగింప నెవ్వఁడు సమర్థుం డగు; అయిన నిపుడు భక్తపరాధీనుండును శరణాగత రక్షకుండు నగు నీశునిఁ జేరం బోవుదము;" అని పలికి పద్మసంభవుండు దేవ పితృగణ ప్రజాపతులం గూడి కైలాసాభిముఖుఁ డై చనిచని. [4-132]

మరి ఇప్పుడు శివుడు చాలా కోపంగా ఉన్నాడు కదా, వెళ్తే మమ్మల్ని ఏం చేస్తాడో అని భయపడకండి. ఉపాయంగా నేను, ఇంద్రుడూ, మునులు, అందరం కలిసి వెళ్ళి ఆ మహాత్ముణ్ణి శరణు వేడదాం. ఆయన రూపం, బలం అవీ దేహధారులకి కొంచెం కూడా తెలిసేవి కాదు. ఆయన సర్వ స్వతంత్రుడు, భక్త పరాధీనుడు (వందే భక్త జనాశ్రయంచ వరదం, వందే శివం శంకరం) కనక ఉపాయంగా వెళ్ళి అడుగుదాం, అని దేవతలనీ, పితృ గణాలనీ, మిగతా ప్రజాపతులనీ వెంటబెట్టుకుని కైలాసానికి బయల్దేరాడు పద్మ సంభవుడు.

ఉ. భాసురలీలఁ గాంచిరి సుపర్వులు భక్తజనైక మానసో
ల్లాసముఁ గిన్నరీజన విలాసము నిత్యవిభూతి మంగళా
వాసము సిద్ధ గుహ్యక నివాసము రాజత భూవికాసి కై
లాసముఁ గాంతి నిర్జిత కులక్షితిభృత్సుమహద్విభాసమున్. [4-133]

అలా వెళ్ళిన బ్రహ్మ మనసుకి ఆనందాన్ని కలిగించేదీ, కిన్నెరలతో కూడినదీ, నిత్యం వైభవంతో ప్రకాశించేదీ, సిద్ధులూ, గుహ్యకులకూ నివశించేదీ, వెండిలా ప్రకాశించేదీ అయిన కైలాసాన్ని చూసాడు. ఈ పద్యంలో పోతన "సము" అనే దాన్ని ఎన్ని విధాలుగా వాడాడో చూసారా? మానసోల్లాసము, విలాసము, మంగళావాసము, నివాసము, కైలాసము, మహద్విభాసము. అసలు ఒక పద్యం రాసేటప్పుడు పోతన అనే మానవమాత్రుకి – ఎంతటి పండిత విద్వత్తు ఉన్నా సరే – ఇన్ని పదాలు ఎలా వస్తాయి మనసులోంచి? దానికి సమాధానం ఒకటే — పలికించెడు వాడు రామభద్రుడట. ఎందుకంటే తుదీ మొదలూ అనేవి లేని భగవద్విభూతి అటువంటిది.

సీ. ధాతు విచిత్రితోదాత్త రత్నప్రభా;
సంగతోజ్జ్వల తుంగ శృంగములును;
గిన్నర గంధర్వ కింపురుషాప్సరో;
జన నికరాకీర్ణ సానువులును;
మానిత నిఖిల వైమానిక మిథున స;
ద్విహరణైక శుభ ప్రదేశములును;
గమనీయ నవమల్లికా సుమనోవల్లి;
కా మతల్లీ లసత్కందరములు; [4-134]

తే. నమర సిద్ధాంగనా శోభితాశ్రమములు;
విబుధజన యోగ్య సంపన్నివేశములును
గలిగి బహువిధ పుణ్యభోగముల నొప్పు
వినుత సుకృతములకు దండ వెండికొండ. [4-134.1]

ఇంకా ఎలా ఉంది ఆ కైలాసం? ధాతుద్రవాలతో, అనేకానేక రత్నాల కాంతులతో ఎత్తైన శిఖరాలు కిన్నరులు, గంధర్వులు, కింపురుషులు, అప్సరసలు లాంటి వారితో నిండి ప్రకాశిస్తున్నాయి దేవతలు విమానాల్లో విహరిస్తున్నారు. దేవతాస్త్రీలు, సిద్ధస్త్రీలు సంచరించటానికి అక్కడి చోట్లన్నీ తగి ఉన్నాయి (విబుధజన యోగ్య సంపన్నివేశములును). చేసిన పుణ్యాలకు పెక్కురకాల భోగాలను అనుభవించడానికి ఆ వెండికొండ పుణ్యాల పూలదండగా ఉంది.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS